సాక్షి గుంటూరు

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



ఘనంగా బాలయేసు చర్చి తిరునాళ్ల

నాదెండ్ల: కనపర్రులోని బాలయేసు పుణ్యక్షేత్ర తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. ఫాదర్ జోజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కార్యసిద్ధి ఆంజనేయుడికి పూజ

నత్తెనపల్లి: నాగన్న కుంటలో వేంచేసి ఉన్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంజనేయుడికి నాగవల్లీదళార్చన



ఫిరంగిపురం: దక్షిణాముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకులుగా పోతిన మహేష్



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులుగా పోతిన మహేష్‌ను నియమిస్తూ ఆదేశాలు మేరకు వెలుబడ్డాయి. ఈ మేరకు మంగళవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పోతిన మహేష్‌ను గుంటూరు పార్లమెంటు నియోజవర్గ పరిశీలకులుగా నియమించారు.

7న కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం మే 7వ తేదీన జరగనుంది. ఈనెల 25వ తేదీన జరగాల్సిన కౌన్సిల్ సమావేశం మేయర్ ఎన్నిక కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. వాయిదా పడిన సమావేశాన్ని ఏడో తేదీన నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. అందుకు సంబంధించిన సర్క్యులర్ కాపీలను సభ్యులకు మంగళవారం అందజేశారు.

దద్దనాల మిట్ట ఆంజనేయ స్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం సమీపంలో గల దద్దనాల మిట్ట ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలవారు అధిక సంఖ్యలో దేవాలయానికి వచ్చి పొంగళ్లు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. స్వామికి ఇష్టమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వీర్ల అంకమ్మతల్లికి బోనాలు



దాచేపల్లి: వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల సందర్భంగా మంగళవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో ఉన్న మహిళలు దేవాలయానికి బోనాలతో వచ్చారు. నెత్తిపై బోనాలు పెట్టుకుని మేళతాళాలతో గ్రామ పుర వీధుల్లో నుంచి దేవాలయానికి చేరుకుని చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రత్యేకంగా పూజలు చేసిన తరువాత అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు యలమల నరేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో శ్రీమహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం శ్రీమహాలక్ష్మి యాగాన్ని నిర్వహించనున్నారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఉదయం 9 గంటలకు యాగం నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. యాగాన్ని దేవస్థానం తరపున ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

గాయత్రీదేవి శక్తి స్థూపం ఆవిష్కరణ



కర్లపాలెం: గాయత్రీదేవి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆధ్యాత్మికవేత్త రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దమ్మనవారి పాలెం గ్రామంలో పి.వెంకట ప్రసూనాంబ, సునందనరావు దంపతుల ఆధ్వర్యంలో గాయత్రీదేవి స్థూపం ఆవిష్కరించారు. ముందుగా స్థూపం వద్ద శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం గాయత్రీ మహామంత్రం జపించి గాయత్రీదేవికి పూజలు చేశారు. ఆధ్యాత్మికవేత్త రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భూమి, ఆకాశం, అగ్ని, జలం, వాయువు మొదలగు పంచభూతాల సమూహమే గాయత్రీదేవి అని చెప్పారు. విశ్వశాంతి కోసం గాయత్రీదేవిని పూజించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురపసాల వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీపీ తాతా లీలా వరప్రసాద్, మాజీ సర్పంచ్ అలపర్తి సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు మరణ మృదంగం

- ప్రైవేటు యూనివర్సిటీల్లో విద్యార్థుల వరుస మరణాలు
- ఆత్మహత్యలుగా చిత్రీకరిస్తున్న విద్యాసంస్థలు
- వంతపాడుతున్న పోలీసులు
- తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా దర్యాప్తు
- వేధింపులే కారణమంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఒత్తిళ్లు .. వేధింపులు.. 'కార్పొరేట్' హత్యలు

అంతా గప్‌చుప్



కాకినాడ జిల్లా, రాజోలుకు చెందిన ఓ విద్యార్థిని హోం సిక్‌పై ఇంటికి వెళ్లి, రాత్రికి రాత్రి అక్కడి నుంచి బస్సు ఎక్కి, విజయవాడ బస్టాండ్ నుంచి తాను ఉంటున్న కుంచనపల్లిలో రూమ్‌కు వచ్చే దారిలో ఓ విద్యార్థితో గొడవపడింది. రెండు గంటల అనంతరం ఆ విద్యార్థిని తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో కిటికీకి ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో ఆ విద్యార్థినితో గొడవపడిన మరో విద్యార్థి ఎవరు? వారి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? అతనివల్ల చనిపోయిందా? ఇతర కారణాల వల్ల చనిపోయిందా అన్నది పోలీసులు ఇప్పటి వరకు తేల్చలేదు. ఆ విద్యార్థినికి తండ్రి లేకపోవడంతో తల్లి ఆ కేసు గురించి మొదటి రోజు తన బిడ్డ చావుకు కారణం తేల్చాలని మాట్లాడినా, రెండవ రోజు పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగలేమంటూ తేల్చి చెప్పేసింది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కార్పొరేట్ విద్యాసంస్థలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఒత్తిడి విద్యార్థులను చంపేస్తోంది. భారీగా వసూలు చేసే ఫీజులు ఒకవైపు, మరోవైపు మార్కుల కోసం పోటీ విద్యార్థులపై ఒత్తిడి పెంచేస్తోంది. ఇటీవల కాలంలో రాజధాని ప్రాంతంలో ఏర్పాటైన ప్రైవేటు యూనివర్సిటీల్లో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఆ మరణాలను పోలీసులు ఆత్మహత్య కేసులుగా నమోదుచేసి వాటి దర్యాప్తును మరుస్తున్నారు. ఒకవేళ సదరు విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆ విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి దర్యాప్తు జరగనీయకుండా అడ్డుకుంటున్నారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ఈ మరణాలకు గల కారణాలు తేల్చడంలో పూర్తిగా విఫలం అవుతోంది. ఈ సంవత్సర కాలంలోనే ఈ ప్రాంతాల్లో వున్న పేరుగాంచిన పలు విద్యాసంస్థల్లో ఇలాంటి మరణాలు సంభవించాయి.

సంవత్సర కాలంలో ఘటనలు..

తాజాగా ఫీజు చెల్లించలేదని నిలదీయడంతో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు చెందిన సుభాష్(20) యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన తండ్రి వచ్చి ఫీజు చెల్లిస్తారని చెప్పినా వినకుండా అవమానించడంతో మనస్థాపానికి గురైన విద్యార్థి 12వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడాడు.

- తాడేపల్లిలో ఒక ప్రైవేటు యూనివర్సిటీ విద్యార్థి విజయవాడలో ఉన్న తన తండ్రికి నేను చనిపోతున్నాను, నన్ను క్షమించండి అంటూ లేఖ రాసి కృష్ణా నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఇది జరిగిన రెండు రోజులకే వడ్డేశ్వరంలోని ఓ యూనివర్సిటీలో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది.
- ఇదే వర్సిటీలో అనంతపురానికి చెందిన మరో విద్యార్థి కూడా ఇదేవిధంగా ఆత్మహత్య చేసుకున్నాడు.

మానసిక ఒత్తిడి వల్లే..?

కొంతమంది విద్యార్థులు మానసిక ఒత్తిడి వల్లే ఇలా జరుగుతుందని, విద్యాసంస్థలు సెమిస్టర్ పరీక్షలు జరిగిన సమయంలో యాజమాన్యం బాగా ఒత్తిడికి గురిచేస్తోందని, మార్కులు తక్కువ వస్తే అదనంగా ఫీజు చెల్లించాల్సి వస్తుందని బెదిరిస్తోందని, ఆ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జరిగిన సంఘటనలపై పోలీసులు, ప్రభుత్వం దర్యాప్తు చేపట్టి, విద్యార్థుల మరణాల పట్ల నిజనిజాలు తేల్చాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు కోరుకుంటున్నారు.



తల్లుల రోదన సైతం పట్టదు..

రాజధానిలో తమిళనాడుకు చెందిన ఓ యూనివర్సిటీలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వారి తల్లిదండ్రులు కాలేజీకి వచ్చి తమ బిడ్డ మరణానికి కారణం చెప్పాలని, తమ కూతురికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని, మీ వేధింపుల వల్లే చనిపోయిందంటూ కాలేజీ వద్ద మృతురాలి తల్లి ధర్నా నిర్వహించారు. అక్కడ వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది బలవంతంగా ఆమెను బయటకు నెట్టివేశారు. కాలేజీలో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను చూపించాలన్నా యాజమాన్యం ఒప్పుకోలేదు.

- మంగళగిరి రూరల్ పరిధిలో రెండు రోజుల క్రితం తమిళనాడుకు చెందిన ఓ విద్యార్థి తన రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య అని యాజమాన్యం అంటుంటే తల్లిదండ్రులు కాదని వాదించినా ప్రయోజనం లేకుండా పోయింది. పోలీసులు దర్యాప్తు చేపట్టినా ఇప్పటి వరకు ఆ విద్యార్థి ఆత్మహత్య గల కారణాలు తేల్చలేదు.

లాభార్జన కోసం కోర్సులను రుద్దుతున్నారు

రాష్ట్రంలో, దేశంలో కంపెనీలకు అనుగుణంగా విద్యాసంస్థలు విద్యను అందించాలి. దానికి విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు వారి లాభార్జన కోసం విద్యార్థులపై తమ కోర్సులను రుద్దుతున్నారు. దాంతో కార్పొరేట్ సంస్థలు ఉద్యోగాలు అందించే సమయంలో పోటీతత్వం ఎక్కువైంది. దానిని తట్టుకునేందుకు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీసుకువస్తున్నారు. ప్రభుత్వ కాలేజీలు, యూనివర్సిటీలు నిర్వీర్యమై కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఏర్పడడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రభుత్వాలు ప్రోత్సహించి అవసరమైన కోర్సులలో శిక్షణ ఇచ్చి, విద్యార్థులో వున్న ప్రతిభను గుర్తించి విద్యను అందిస్తే ఆత్మహత్యలు జరగవు.

– ప్రొఫెసర్ బూరగ శ్రీనివాసరావు

నేడు పాలిసెట్

- గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 4,030 మంది విద్యార్థులు
- నిముషం ఆలస్యంగా వచ్చినా నో... ఎంట్రీ

గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై ఉద్దేశించిన పాలిసెట్–2025 బుధవారం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 4,030 మంది విద్యార్థులకు గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 11 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించబోమని పాలిసెట్–2025 సమన్వయకర్త, నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు.

ఇక నుంచి పొగాకు బోర్డులోకి బ్లాక్ బర్లీ !

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు, రైతుల పోరాట ఫలితంగా బ్లాక్‌బర్లీ పొగాకును పొగాకు బోర్డులోకి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని రైతు సంఘ నాయకులు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాల వరకు బ్లాక్ బర్లీ పొగాకు సుమారు రూ.20వేలు నుంచి రూ.21వేల వరకు క్వింటా ధర పలికింది. ఈ ఏడాది రూ.2వేలు, రూ.3వేలు అని అంటున్నా.. కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ బర్లీ పొగాకు దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా గుంటూరు జిల్లాలో 10వేల ఎకరాల్లో వేశారని రైతు సంఘ నాయకులు చెబుతున్నారు. అయితే గతంలో బ్లాక్ బర్లీ సాగు పొగాకు బోర్డులో ఉండేది కాదు. గత కొంత కాలంగా రైతు సంఘ నాయకులు, రైతులు, రైతు కార్మికులు చేస్తున్న పోరాటాలు, విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని బ్లాక్ బర్లీని పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకువచ్చింది. దీనిపై రైతు సంఘ నాయకుడు కంచుమాటి అజయ్ హర్షం వ్యక్తం చేశారు.

ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వజ్రోత్సవాలు ప్రారంభం



వర్సిటీ వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కె.అచ్చెన్నాయుడు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటై 60 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న వజ్రోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. గుంటూరు శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని వర్సిటీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎన్జీరంగా విగ్రహావిష్కరణ చేశారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వర్సిటీ రైతుల కోసం మరిన్ని వంగడాలను తయారు చేయాలని సూచించారు. ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి సాంకేతిక సదస్సును ప్రారంభించి విశ్వవిద్యాలయ ప్రగతిని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ప్రొఫెసర్ విజయ్‌పాల్‌శర్మ, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రిరెడ్డి శ్రీనివాస్ నూతన వంగడాలు, పరిశోధనలపై చర్చించారు. సాంకేతిక నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. మాజీ ఉపకులపతి డాక్టర్ పి.రాఘవరెడ్డి మాట్లాడుతూ 1964 నుంచి నేటి వరకూ విశ్వవిద్యాలయం సాధించిన అభివృద్ధి, కృషిని అభినందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవి సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ అతిథులను శాలువాలతో సత్కరించారు. విశ్వవిద్యాలయం 60 ఏళ్ళలో సాధించిన ప్రగతికి నిదర్శనంగా ఏర్పాటు చేసిన 150 పరిశోధన, వంగడాలు, ఇతర స్టాళ్లు రైతులు, సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకల్లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు, పి.జె.పి.ఎస్.ఏ.యూ వైస్‌చాన్సలర్ జానయ్య, పశు వైద్య విశ్వవిద్యాలయం వీసీ జె.వి.రమణ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.గోపాల్, ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణ, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మాజీ వీసీ డాక్టర్ దామోదర్ నాయుడు,రైతులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాలక మండలి సభ్యులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ దేవస్థానంపై కూటమి కుట్రలు

- అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘనే
- అధికారం అండగా రెచ్చిపోతున్న వైనం
- వివాదం హైకోర్టులో ఉన్నా ఖాతరు చేయని ధిక్కారం
- గంటల వ్యవధిలో ప్రమాణస్వీకారానికి ముహూర్తం
- 4వ తేదీ సమావేశానికి చట్టబద్ధత లేదంటూ ప్రచారం
- స్వయం ప్రకటిత కమిటీ ఆగడాలపై ఆర్యవైశ్యుల ఆవేదన

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వివాదం తారాస్థాయికి చేరింది. అధికారమే అండగా సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్నారు. మరోరోజు పోలీసు బలగాల నడుమ ఏకపక్షంగా తమకు తామే కొత్త కమిటీ ఎన్నికైనట్టు రాసేసుకున్నారు. అసలు కమిటీ సర్వసభ్య సమావేశాన్ని మే నెల నాలుగో తేదీన ఏర్పాటుచేస్తూ సభ్యులకు నోటీసులు పంపింది. ఆలయ కమిటీ వివాదం హైకోర్టులో ఉంది. మరో మూడురోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి. ఈలోగానే ఎక్కడ కోర్టు తీర్పు తమకు వ్యతిరేకంగా వస్తుందనే భావనతో హడావుడిగా ప్రమాణస్వీకారానికి తెగబడ్డారు. మరి కొన్ని గంటల్లో ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాల్లో ఉన్నారు. స్వయం ప్రకటిత కమిటీ పోకడలతో ఆర్యవైశ్యులు మనోవేదన చెందుతున్నారు.



స్వయం ప్రకటిత ఎన్నిక రోజున శ్రీవాసవీ దేవస్థానం ఎదుట పోలీసు బందోబస్తు

పురాతన దేవాలయం

తెనాలిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రత్యేకమైంది. సువిశాలమైన నాలుగెరకాల విస్తీర్ణంలో 125 ఏళ్లకు పూర్వమే ఇక్కడ నిర్మితమైన శ్రీవాసవీ అమ్మవారి ఆలయం పురోగతి 2004 నుంచి విస్తృతమైంది. దేవస్థానం స్థలంలోనే గీతాభవనం, వైశ్య వ్యాయామశాల, వైశ్యవిద్యార్థి ధర్మనిధి, ఆర్యవైశ్య అపరకర్మశాల ఉన్నాయి. శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయాన్ని నిర్మించారు. నాలుగు కల్యాణమండపాలు, 20 సూట్లు సమకూరాయి. దేవస్థానం సత్రం కమిటీ దాతల సహకారంతోనే ఇవన్నీ సమకూర్చుకోగలిగారు. ఆలయానికి నెలకు రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

ఆలపాటి అరంగేట్రంతోనే..!

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్సీగా ఎన్నికవటంతో ఆలయ పాలకవర్గంపై ఆధిపత్యం కోసం టీడీపీ ఆర్యవైశ్య నేతల ఆరాటం మొదలైంది. పాలకవర్గం పదవీకాలం పూర్తవటంతో ఈనెల 13న సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటుచేశారు. టీడీపీకి చెందిన ఆర్యవైశ్య నేతలు సమావేశం జరక్కుండా గందరగోళం సృష్టించారు. ఆర్యవైశ్యులు కాని టీడీపీ నేతలు, అన్య కులస్థులను భారీగా సమీకరించారు. వీరిలో కొందరు రౌడీషీటర్లు కూడా ఉన్నారు. దీంతో విధిలేని స్థితిలో సమావేశాన్ని వాయిదా వేశారు. ఇదే అదనుగా తర్వాత రెండురోజులకు టీడీపీ ఆర్యవైశ్యులు సమావేశానికి పిలుపునిచ్చారు. 15న తమ మద్దతుదారులతో వచ్చారు. అసలు కమిటీ నాయకుల అభ్యంతరాలను ఖాతరు చేయలేదు. అధికారం అండతో తమకు తామే కమిటీని కొత్త పుస్తకాల్లో రాసుకున్నారు. ఆఫీసు రూమ్ తాళాలు పగులగొట్టారు. తిరిగి వెళుతూ జై ఆలపాటి అంటూ నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. ఇక అప్పట్నుంచి దూకుడు మొదలైంది.

ఏకపక్ష కమిటీ ప్రకటనపై ఆవేదన

ఆ తర్వాత అసలు కమిటీ మే నెల 4వ తేదీన సర్వసభ్య సమావేశానికి నిర్ణయించింది. వెయ్యి మంది సభ్యులకు లేఖలను పంపింది. కమిటీ బైలా నిబంధనల ప్రకారం సర్వసభ్య సమావేశంలో నిర్ణయం ప్రకారం ఎన్నిక నిర్వహించాలి. పోటీ ఉన్నట్టయితే మరో తేదీని నిర్ణయించి రహస్య బ్యాలెట్‌లో ఎన్నికలు జరపాల్సి ఉంది. అవేమీ లేకుండానే ఏకపక్షంగా కమిటీని ప్రకటించటం, పాత కమిటీ రద్దయిందన్న ప్రచారంపై ఆర్యవైశ్యులు నివ్వెరపోతున్నారు. పవిత్రమైన శ్రీవాసవీ అమ్మవారి దేవస్థానం ప్రాంగణాన్ని వివాదాలకు కేంద్రంగా చేయటంపై వారు వేదన పడుతున్నారు. మరోవైపు ఈ వివాదం హైకోర్టులో ఉంది. అసలు కమిటీ హైకోర్టును ఆశ్రయించగా, స్వయం ప్రకటిత కమిటీ తరపున కేవియట్ వేశారు. మొత్తానికి మే నెల రెండో తేదీన దీనిపై హైకోర్టు స్పష్టత ఇవ్వనుందనే వార్తలు వచ్చాయి.

తీర్పు నేపథ్యంలో హడావుడిగా ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు..

దీంతో దృశ్యం మారింది. హడావుడిగా బుధవారం సాయంత్రం స్వయం ప్రకటిత పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్ అతిథులుగా ఆహ్వాన పత్రికలను సిద్ధం చేశారు. హైకోర్టులో వివాదం ఉన్న నేపథ్యంలో స్వయం ప్రకటిత కమిటీ ప్రమాణస్వీకారం ఏమిటి? ఇందుకు కూటమి మంత్రులు ఎలా వస్తారు? అంటూ పట్టణంలో తీవ్ర చర్చ నడుస్తోంది. పాలకవర్గం ప్రస్తుత అధ్యక్షుడు, ఆలయ అభివృద్ధిలో తనదైన ముద్రవేసిన నూకల వెంకట వేణుగోపాలరావు తీవ్ర అస్వస్థతకు లోనవటంతో 'మెడికల్ ఎమర్జన్సీ'గా అమెరికా తరలించారు. ఇలాంటప్పుడు ఎన్నడూలేనివిధంగా ఆలయ పాలకవర్గంలో ఆధిపత్యం కోసం టీడీపీ ఆర్యవైశ్య నేతలు నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘించటం, అందుకు మంత్రులు సైతం సై అంటూ వస్తామనటం తీవ్ర విమర్శలకు గురవుతోంది.

ప్రధాని సభ ఏర్పాట్లు పరిశీలన

తాడికొండ: ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లను మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు. మే 2వ తేదీ సాయంత్రం 3:20 గంటలకు ప్రధాని మోదీ అమరావతికి వస్తారని మంత్రి చెప్పారు. రాజధాని పనుల పునఃప్రారంభంతో పాటు రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని ప్రారంభిస్తారని వెల్లడించారు.

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): రాజధాని ప్రాంతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానున్న సభకు జిల్లా నుంచి తరలివచ్చే ప్రజానీకానికి ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్టు రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ప్రధాని పర్యటనపై అధికారులు, కార్పొరేటర్లు, కూటమి నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

తాడికొండ: ప్రధాని మోదీ మే 2న అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను రాష్ట్ర హోం మంత్రి అనిత మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు, ఇతర వివరాలు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ వివరించారు.



ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

గుంటూరు వెస్ట్: అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునః ప్రారంభించే కార్యక్రమానికి హాజరు కానున్న భారత ప్రధాని నరేంద్రమోదీ సభను అధికారులు సమన్వయంతో, పటిష్ఠ ప్రణాళికతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జేసీ ఎ.భార్గవ్‌తేజతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రితో పాటు వీవీఐపీలు పాల్గొనే సభ విజయవంతానికి అధికారులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఆహారం, మంచినీరు లాంటి వసతులు సమకూర్చాలన్నారు. డీఆర్ఓ షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,000** గరిష్ఠం : రూ. **8,600**

మోడల్ ధర రూ. **7,400**

మిర్చి యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,27,525
అమ్మకాలు	1,24,819
నిల్వ	52,500

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,200
నంబరు-5	10,000-12,500
273	10,000-12,400
341	10,000-13,200
4884	10,000-11,200
సూపర్-10	10,000-12,400
తాలుకాయలు	4,500-6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,600
షార్క్-1	10,000 - 12,100
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 12,600
ఆర్మూర్	9,800 - 11,200
తాలు	4,500 - 6,500

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

పసుపు ధరలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు 779 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

- కొమ్ములు 657 బస్తాలు రాగా వాటి కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11,275 మోడల్ ధర రూ.11,211 పలికింది.
- కాయలు 122 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11,275, మోడల్ ధర రూ.11,200 పలికింది. మొత్తం 584.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ మండలంలోని వీ.కొప్పరపాడు గ్రామంలోజిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,1116, రెండో బహుమతిగా రూ. 15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాల్గవ బహుమతిగా రూ.5,116, మ్యాన్ ఆఫ్ ది సిరిస్ బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్టు బౌలర్‌కు బహుమతులు అందజేస్తున్నామని మరిన్ని వివరాలకు బలరాం 7036938516 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు

- రసాయన ఎరువులతో తగ్గుతున్న భూసారం
- ప్రకృతి వ్యవసాయంతో సమస్యలకు చెక్
- గుంటూరు జిల్లాకు 52 వేల కిట్లు పంపిణీకి లక్ష్యం



కొల్లిపర మండలం హనుమానుపాలెంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పొలం

కొరిటెపాడు(గుంటూరు): భూతాపం తగ్గాలన్నా.. భూసారం పెరగాలన్నా.. తినే ఆహారం ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నా రైతులంతా తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రసాయనిక ఎరువుల వలన భూసారం క్రమేపీ తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో ఆ భూములను మళ్లీ సారవంతంగా చేయాలంటే రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులు ఖరీఫ్ సీజన్‌కు ముందే నవధాన్యాల సాగు చేయాలి. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సుమారు 12 కిలోల బరువున్న నవధాన్యాల విత్తనాల కిట్లను రూ.1200లకు అందజేస్తున్నారు. ఈ కిట్‌లో 30 రకాల విత్తనాలు ఉంటాయి. ఇలా మిశ్రమ విత్తనాల సాగువల్ల భూమిలో జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతం అవుతోంది. గుంటూరు జిల్లాలో గతేడాది 25,475 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 50 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

సాగు చేసే విధానం ఇలా..

వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే పొలంలో నవ ధాన్యాలు చల్లు కోవాలి. ఇవి వేసిన 45 రోజుల వ్యవధిలో పూత దశలో దమ్ము చేయాలి. పశువుల మేతకు ఇది ప్రయోజనం. నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం. చల్లుకుని కలియదున్నుకోవచ్చు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనాలు ఇవే...

- పొలంలో నవధాన్యాలను కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- మొక్కలకు నత్రజని, సూపర్ ఫాస్పేట్ అదనంగా అందుతుంది.
- జింకు, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు చేకూరుతాయి.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వానపాముల ఉత్పత్తికి దోహదపడుతుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. వేరు వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడంతో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. నేలలో సారం పెరగడమే కాక నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలో లభ్యం కాని రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోనికి మారుస్తాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు.
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది.
- నాణ్యమైన గింజలు ఉత్పత్తి అవుతాయి. దిగుబడి రెట్టింపు అవుతుంది.

ఎంతో ప్రయోజనం



ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఖరీఫ్‌లో గుంటూరు జిల్లాలో 30 వేల నవధాన్యాల కిట్లు పంపిణీ చేశాం. ఈ ఖరీఫ్‌లో 52 వేల కిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు ప్రయోజనం పొందుతున్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. ఈ నవధాన్యాల సాగు ద్వారా 55 రకాల పోషకాలు భూమికి అందుతాయి.

– కె.రాజకుమారి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్

రైతుల్లో ఆసక్తి పెరిగింది..



ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఈ వ్యవసాయం చేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు ఎంతో మేలు. ఇది భూసారాన్ని పెంపొందిస్తోంది. రసాయనిక ఎరువుల ద్వారా రానురానూ భూసారం తగ్గిపోతోంది. ఈ ఖరీఫ్‌లో మరింతగా రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ మేరకు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

–నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి

న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమం



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ అండ్ లేబర్ న్యాయమూర్తి బి.రాములు, చైల్డ్ ఫ్రెండ్లీ కోర్ట్ (పోక్సో కోర్టు) న్యాయమూర్తి షమీ పర్వీన్ సుల్తానా బేగంల పరిచయ కార్యక్రమం జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో అన్ని కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తి న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా కోర్టులోని వాహనాల పార్కింగ్ వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా కోర్టులోని అన్ని కోర్టులకు కావలసిన వసతులను సమకూర్చి, కోర్టులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని కోర్టులకు కావలసిన వసతులను సమకూర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా కోర్టులో మహిళా న్యాయవాదులకు బార్ అసోసియేషన్‌లో కావలసిన ఏర్పాట్లను సాధ్యమైనంత మేర సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పురాణం కల్యాణ లేడీ రిప్రజెంటివ్ బార్ అసోసియేషన్‌కు 30 కుర్చీలు అందజేశారు. క్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి 50 కుర్చీలకు కావలసిన నగదు చెక్కును ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగళ శెట్టి శివ సూర్యనారాయణకు అందజేశారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు యంగళశెట్టి శివసూర్యనారాయణ మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ రిలేషన్‌కు కావలసిన సహాయ సహకారాలు అందించటానికి న్యాయవాదులు తరపున హామీ ఇచ్చారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

శావల్యాపురం: హత్య కేసులో నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా...మండలంలోని శానంపూడి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన అమృతపూడి నాగేశ్వరరావు (36) గతేడాది అక్టోబరు 7వ తేదీన కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి మృతుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా విచారణ చేపట్టారు. విచారణలో మృతుడు, వినుకొండ మండలం ఎనుగుపాలెం గ్రామానికి చెందిన దావులూరి వీరబ్రహ్మం కలసి మండలంలోని కారుమంచి గ్రామం అద్దంకి బ్రాంచ్ కెనాల్ కట్టపై అక్టోబరు 7వ తేదీన రాత్రి మద్యం తాగుతున్న సమయంలో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మృతుడు నాగేశ్వరరావును, వీరబ్రహ్మం కాల్వలోకి తోసి పరారయ్యాడు. మార్టూరు సమీపంలో వలపర్ల కొమ్మినేనివారిపాలెం టి.జంక్షన్ వద్ద మృతదేహం లభ్యమైంది. అప్పట్లో మార్టూరు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. అనంతరం కేసును శావల్యాపురం పోలీసు స్టేషనుకు బదిలీ చేశారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దావులూరి వీరబ్రహ్మంను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

భర్తపై భార్య యాసిడ్ దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

పెదకాకాని: భర్తపై భార్య యాసిడ్‌తో దాడి చేసిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. విశాఖపట్నం గాజువాకకు చెందిన గండికోట బాలకృష్ణ సొంతగా లారీలు బాడుగకు తిప్పుకుంటున్నాడు. అతనికి గుంటూరుకు చెందిన రమణమ్మతో రెండు నెలల కిందట అడిగొప్పలలో వివాహమైంది. అప్పటికే రమణమ్మకు మూడు పెళ్లిళ్లు అయ్యాయి. ఈనెల 26వ తేదీన వట్టిచెరుకూరు మండలంలో కుర్నూతల ఉన్న బాలకృష్ణ సోదరి ఇంట్లో శుభకార్యం జరిగింది. ఈ శుభకార్యానికి వెళ్లడానికి వీలులేదంటూ భార్య రమణమ్మ అడ్డుతగలడంతో వెళ్లకుండానే ఆగిపోయారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. సోమవారం రాత్రి బాలకృష్ణ గుంటూరు నుంచి మంగళగిరి మండలంలోని కాజ గ్రామంలో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యంలో పెదకాకాని శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న పల్లాలమ్మ చెరువు వద్దకు మరొక వ్యక్తి సహకారంతో కారులో భార్య రమణమ్మ అక్కడికి చేరుకుంది. రోడ్డుపై వెళుతున్న భర్త బైక్‌ను ఆపి వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను ముఖంపై పోసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ దాడిలో గాయపడిన బాలకృష్ణను స్థానికులు 108 వాహనంలో గుంటూరు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

రైల్వే గ్యాంగ్‌మెన్ ఆత్మహత్య



సత్తెనపల్లి: రైల్వే గ్యాంగ్‌మన్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో మంగళవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే గ్యాంగ్‌మన్‌గా పనిచేస్తున్న షేక్ మస్తాన్‌వలి (59) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో మెడ, చేతికి బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మృతుడికి భార్య కరీమూన్, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య కరీమూను ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన మహా మంజీరనాదం



కళాకారుల నృత్యార్చన

నగరంపాలెం: గత వారం రోజులుగా బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు (మహా మంజీర నాదం -2025) మంగళవారంతో ముగిశాయి. నటరాజ స్వామి 'వందన రఘు నందన' అనే త్యాగరాజ కీర్తనకు దాదాపు 200 మంది కళాకారులు నృత్యార్చన చేశారు. సాయంత్రం జరిగిన ముగింపు సభకు ఆలయ అధ్యక్షుడు మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేయగా, సంస్థ నిర్వాహకులు భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సిరిపుల్ రాజమోహన్ (కేరళ) మోహిని అట్టం, అవిజిత్ కుందు (బెంగళూరు) భరత నాట్యం ప్రదర్శించారు. అనంతరం కళారత్న పురస్కార గ్రహీత డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యంకు పసుమర్తి కృష్ణమూర్తి స్మారక జీవిత సాఫల్య శత గురు జయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి, సంస్థ కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

నరసరావుపేటటౌన్: వ్యక్తిని దారుణంగా హతమార్చటంతోపాటు రూ.380 నగదును దోపిడీ చేసినట్లు నేరం రుజువవడంతో నిందితుడు పట్టణానికి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2023వ సంవత్సరం మే నెల 9వ తేదీ రాత్రి పట్టణంలోని గాంధీ పార్క్ ఎదుట గల బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద నిద్రిస్తున్న 55 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తిని నిందితుడు ఇటుకరాయితో మోది దారుణంగా హతమార్చాడు. అతని వద్ద నుంచి కొంత నగదు తస్కరించాడు. సంఘటన జరిగిన మరుసటి రోజు 18వ వార్డు వీఆర్వో చల్లా చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు అంకమ్మరావును అరెస్టు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం అప్పటి సీఐ ఎ.అశోక్‌కుమార్ కోర్టులో అభి యోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువడంతో హత్య కేసులో జీవిత ఖైదు, రూ.10000 జరిమానా, దోపిడీ కేసులో పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించారు. శిక్షను ఏకకాలంలో అనుభవించేలా తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు. నిందితుడు అంకమ్మరావు పలు హత్య, చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

శిరిగిరిపాడు ఎస్సీ కాలనీలో ఇరువర్గాల ఘర్షణ

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు ఎస్సీ కాలనీలో ఇరువర్గాలు ఘర్షణ పడి రాళ్లు రువ్వుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఆరుమళ్ల విజయ్, కొమ్ము బొంగురు మాచర్ల పట్టణంలో సోమవారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ పడి దాడులు చేసుకున్నారు. వీరు స్వగ్రామమైన శిరిగిరిపాడులో బంధువులకు సమాచారం అందింది. మంగళవారం ఉదయం ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. మధ్యాహ్నం మరోసారి రాళ్లు వేసుకున్నారు. కాలనీలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలో ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కాలనీకి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. కాలనీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

'నెత్తుటి సంతకం' నాటకానికి ప్రథమ బహుమతి

నాటక, నాటిక రచనల పోటీల్లో విజేతల ప్రకటన

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వితీయ సాంఘిక నాటక, నాటిక రచనల పోటీల ఫలితాలను కార్యదర్శి గోపరాజు విజయ్ మంగళవారం ప్రకటించారు. నాటకం విభాగంలో చిలకలూరిపేటకు చెందిన నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు రచన 'నెత్తుటి సంతకం' నాటకం ప్రథమ ఉత్తమ రచనగా ఎంపికైంది. అరిశెట్టి శివన్నారాయణ జ్ఞాపకార్థం బహూకరించే రూ.20 వేల నగదును గెలుచుకుంది. విశాఖపట్నం నాటక రచయిత పీటీ మాధవ్ రచన 'తెల్లకోటు తెల్లబోయింది' నాటకం ద్వితీయ ఉత్తమ రచనగా ఎంపికైంది. పరాంకుశం భవానిప్రసాద్ జ్ఞాపకార్థం రూ.15 వేల బహుమతిని గెలిచింది.

సాంఘిక నాటికల విభాగంలో...

సాంఘిక నాటికల విభాగంలో హైదరాబాద్ రచయిత సింహప్రసాద్ రచన 'వంటింటికి నిప్పుపెట్టండి' నాటిక ప్రథమంగా ఎంపికై, భారతుల రామకృష్ణ జ్ఞాపకార్థం బహూకరించే రూ.15 వేల బహుమతిని గెలుచుకుంది. విజయవాడ రచయిత సుఖమంచి కోటేశ్వరరావు రాసిన 'మమ్మల్నీ బ్రతకనివ్వండి' నాటిక ద్వితీయ ఉత్తమ రచనగా ఎంపికై, గంధం నాగరాజు జ్ఞాపకార్థం అందజేస్తే రూ.10 వేల బహుమతిని అందుకోనుంది. న్యాయనిర్ణేతలుగా గోపరాజు రమణ, భర్తిపూడి సుబ్బారావు వ్యవహరించారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కమిటీ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, పక్కన విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న సుభాష్ అనే విద్యార్థి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. స్థానిక బ్రాడీపేట ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవాల్సిన విశ్వవిద్యాలయాల్లో వరుసగా విద్యార్థులు మృతి చెందుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల మృతుల ఘటనలపై కమిటీ వేసి విచారణ చేయాలని ఆయన కోరారు. విద్యార్థులు వరుసగా మరణిస్తున్నా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏమాత్రం స్పందించడం లేదన్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను మాత్రం ప్రభుత్వం తాము సాధించిన ఘనతగా ప్రచారం చేసుకుంటూ విద్యార్థులు మరణాలకి వారి తమకేమాత్రం సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, నగర కార్యదర్శి ఎ.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..

లక్ష్మీపురం: రాజధాని అమరావతిలో వున్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థి మృతికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర దర్యాప్తు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని జిల్లా కార్యదర్శి వై.నేతాజీ తెలిపారు. బ్రాడిపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో వున్న ఎస్ఆర్ఎం వర్సిటీలో యాజమాన్యం వేధింపుల కారణంగా విద్యార్థి మృతిచెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. కనీసం చనిపోయిన విషయం తల్లితండ్రులకు సకాలంలో సమాచారం ఇవ్వకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు యూనివర్సిటీల్లో ఇటీవల కాలంలో విద్యార్థులు మృతి చెందిన పరిస్థితి ఉందని గుర్తు చేశారు. ఆ సందర్భంలో కూడా ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయకపోవడం వల్ల ఇటువంటివి పునరావృతం అవుతున్నాయన్నారు. సంఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీని వేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

రసవత్తరంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు



బండ లాగుతున్న ఎడ్లజత

దాచేపల్లి: రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు మంగళవారం రసవత్తరంగా జరిగాయి. ఆరుపళ్ల విభాగంలో జరిగిన పోటీలో ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం కాజీపురానికి చెందిన వేగనాటి ఓసూరరెడ్డి ఎడ్లజత 5వేల అడుగుల దూరం బండలాగి మొదటిస్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా పంగలూరు మండలం పంగలూరుకి చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్ల జత 4,952 అడుగుల దూరం బండలాగి రెండో స్థానం, ప్రకాశం జిల్లా అర్ధవీడుకి చెందిన సూర చైత్రరెడ్డి పూజితరెడ్డి ఎడ్ల జత 4,856 అడుగుల దూరం బండ లాగి మూడో స్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన కావ్యనంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్ నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 4,750 అడుగుల దూరం బండలాగి నాల్గవ స్థానం, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకి చెందిన మేక అంజిరెడ్డి ఎడ్ల జత 4,358 అడుగుడుల దూరంబండలాగి ఐదవస్థానం, పల్నాడు జిల్లా గురజాల మండలం అంబాపురంకి చెందిన చుండు అప్పయ్య చౌదరి ఎడ్ల జత 4వేల అడుగుల దూరం బండలాగి ఆరో స్థానం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరానికి చెందిన పీవీఆర్ బుల్స్, పెదవల్లి బ్రదర్స్ 3,108 అడుగుల దూరం బండలాగి ఏడో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల రైతులకు దాతలు బహుమతులు, నగదు ప్రదానం చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, యలమల నరేష్, అనిశెట్టి శ్రీనివాసరావు, మునగా నిమ్మయ్య, కానుకొల్లు ప్రశాంత్ తదితరులు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ శిలాఫలకం ధ్వంసం



పెదకాకాని మండలం అగతవరప్పాడులో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన శిలాఫలకం

పెదకాకాని: గుర్తు తెలియని వ్యక్తులు అగతవరప్పాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ శిలాఫలకం ధ్వంసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు ఏపీఎన్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, సీసీ డ్రైన్‌ను 2024 జనవరి నెలలో ప్రారంభించారు. సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని అప్పటి ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేశారు. ఆ శిలాఫలకాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శిలాఫలకం ధ్వంసంపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లినట్లు సర్పంచి పిట్టు శివకృష్ణారెడ్డి తెలిపారు.

పెన్షనర్ల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడాలి



మాట్లాడుతున్న వక్తలు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్ల బిల్డింగ్‌లో అధ్యక్షులు మానం సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం పల్నాడు జిల్లా శాఖ పెన్షనర్ల సంఘ ఏప్రిల్ నెల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షులు లంకా రంగనాయకులు, కార్యదర్శి సీసీ ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాదు, అసోసియేషన్ ప్రెసిడెంట్ కంచుపర్తి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి పచ్చల నాగభూషణం, ఉపాధ్యక్షులు చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి, పూనాటి సుబ్బారావు పాల్గొన్నారు. కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాదు 2024–25 ఏడాదికి ఫైనాన్స్ స్టేట్‌మెంట్‌ను ప్రవేశపెట్టారు. హెల్త్, గుర్తింపు కార్డుల గురించి చర్చించారు.

ట్రక్కు డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి అనుమతులు

స్వీకరించిన రోడ్డు సేఫ్టీ ప్రతినిధులు



పద్మజకు అనుమతి పత్రాన్ని అందజేస్తున్న ఆర్టీఓ సంజయకుమార్

నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రంలో స్థానిక రవాణా శాఖ ఆర్టీవో కార్యాలయం పక్కనే ఏర్పాటుచేసిన ట్రక్కు డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో జిల్లా రవాణా శాఖ అధికారి సంజయకుమార్ అనుమతులు మంజూరు చేశారని ఆ శిక్షణ సంస్థ మేనేజింగ్ పార్టనర్ కనకదుర్గ పద్మజ వెల్లడించారు. అనుమతి పత్రాన్ని మంగళవారం జిల్లా రవాణా శాఖ అధికారి జి.సంజీవ్ కుమార్, ఎంవీఐ శివనాగేశ్వరరావు, వంశీల చేతుల మీదుగా తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ వెనుకబడిన పల్నాడు జిల్లా ప్రాంతంలో యువతకు స్వయం ఉపాధి కోసం కారు, హైడ్రాలిక్‌తో కూడిన ట్రక్ డ్రైవింగ్ (ట్రాన్స్‌పోర్టు వాహనం) శిక్షణ, లైసెన్స్, ఉపాధి ప్రాతిపదికన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలో చదువులేని యువతకు ఉపాధి కొరకు డ్రైవింగ్ శిక్షణ ఇప్పిస్తామని, అదేవిధంగా రోడ్డు సేఫ్టీ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇస్తామని తెలిపారు.